క్లుప్తంగా

సత్రం భూములకు 8న కౌలు హక్కుల వేలం

మండపేట: పట్టణంలోని నాళం చిన భీమయ్య అన్న సత్రానికి చెందిన భూముల మూడేళ్ల కౌలు హక్కుల కోసం ఈనెల 8న ఏడిదలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సత్రం ధర్మకర్త ఎన్‌కేఎస్‌కే సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడిదలోని సర్వే నంబర్ 522/5, 522/6లలోని 1.62 ఎకరాల భూమికి కౌలు సాగు నిమిత్తం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు వేలం జరుగుతుందన్నారు. అదనపు సమాచారం కోసం మండపేటలోని సత్రం కార్యాలయంలో సంప్రదించాలని సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో 72 మందికి వైద్యం



పడమర ఖండ్రిక శిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పడమర ఖండ్రిక గ్రామంలోని 72 మందికి అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి వైద్య సేవలు అందించారు. ఎండవేడిమి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, షుగరు వంటి సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన శిబిరానికి రాలేని రోగుల ఇళ్లకు డాక్టర్ రత్నకుమారి వెళ్ళి చికిత్స చేశారు. ప్రతి నెలా 1వ సోమవారం క్రమం తప్పకుండా శిబిరాన్ని కొనసాగిస్తున్నట్టు ఆమె తెలిపారు. శిబిరంలో 104, అంగర పీహెచ్‌సీ సిబ్బంది సేవలందించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



డీఈవో కమలకుమారిని సత్కరిస్తున్న ఉమాదేవి

రామచంద్రపురం: పట్టణంలోని పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న మోడరన్ హైస్కూల్‌ను డీఈవో కమలకుమారి సోమవారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న విధానంపై డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి నాలుగు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న విద్యా సంస్థల అధినేత జీవీరావు సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మోడరన్ స్కూల్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి డీఈవోను దుశ్శాలువాతో సత్కరించారు.

పలువురికి మంత్రి పరామర్శ



వెంకటాయపాలెంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ఇటీవల మృతి చెందిన మండలంలోని వెంకటాయపాలెంకు చెందిన శెట్టిబలిజ సంఘం పెద్ద రాయుడు సత్యనారాయణ, స్థానిక నాయకురాలు గొలకోటి రత్నరాణి కుటుంబాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం పరామర్శించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దడాల రవికుమార్, శెట్టిబలిజ, కాపు పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

మండపేట: ఈ నెల 16 నుంచి చెన్నైలో నిర్వహించే జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక పోటీల్లో మండపేటకు చెందిన పలువురు ఎంపికైనట్టు ఏపీ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ నెల 4న విజయనగరం జిల్లాలో రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధర్యంలో మహిళా, పురుషుల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున ఎంపిక చేసేందుకు పోటీలను నిర్వహించారన్నారు. ఎంపిక పోటీల్లో మండపేట క్రీడాకారులు పిల్లి రామారావు ప్రథమ, వడ్డాది వినయ్‌కుమార్ ద్వితీయ, లేగా త్రిమూర్తులు తృతీయ స్థానంలోనూ నిలిచారని సత్యనారాయణ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కపిలేశ్వరపురం: టేకి గ్రామ శివారు పశువుల సావిడిలో అంగర గ్రామానికి చెందిన యువకుడు కందిబొట్ల త్రిమూర్తులు (32) ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం... అంగరలోని గుడ్డిగూడెంలో నివాసముంటున్న త్రిమూర్తులు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై జి.చంటి కేసు నమోదు చేసి మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విత్తన ఎంపికే కీలకం

- ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం
- ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక దిగుబడులు
- నకిలీ విత్తనాలతో మోసపోవద్దని అధికారుల సూచన



సాగులో ఉన్న వరి పంట (ఫైల్)

కె.గంగవరం: వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఈ ప్రక్రియే రైతు దిశ, దశను మారుస్తుంది. విత్తన ఎంపిక, కొనుగోలులో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా రైతాంగం నష్టపోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నప్పుడు విత్తన ఎంపికలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల వ్యాప్తంగా అత్యధికంగా వరి సాగు చేస్తున్నారు. అయితే విత్తనాలు ఎంపిక చేసుకునేటప్పుడు రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుంది. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి, సాగు చేస్తే పంట ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు.

విత్తనాల ఉత్పత్తి ఇలా...

విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి, మళ్లీ విత్తనాలుగా వినియోగించవచ్చు. దీని వల్ల రైతులకు విత్తన భారం తగ్గుతుంది. ఈ విత్తనాల ధర ఎక్కువగానే ఉండడమే కాకుండా షాపులో విరివిగా లభ్యం కావు. బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్‌ను ఉత్పత్తి చేస్తారు. వివిధ ఉత్పత్తి సంస్థలు సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో వీటిని పండిస్తారు.

కొనుగోలు చేసేటప్పుడు ఇవి చూడాలి

వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. బిల్లుపై విక్రదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, నికర తూకం, నికర ధర, ల్యాబ్ నెంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూడాలి. ఎట్టి పరిస్థితిల్లోను లూజు (విడిగా) విత్తనాలను కొనుగోలు చేయకూడదు. గడువు దాడిన విత్తనాల జోలికి అస్సలు వెళ్లకూడదు. కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్ల నుంచి, డబ్బాలపై సీల్ ఉందా, లేదా అని చెక్ చేసుకోవాలి. విక్రయదారులు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి, అవగాహన చేసుకోవాలి. మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించి, సలహాలు, సూచనలు తీసుకోవాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే వాటిని పరీక్షించి, మొలక శాతం పరిశీలించాలి.

మొలక శాతం చూసుకోవాలి

బయట షాపుల్లో విత్తనాల కొనుగోలు చేయాల్సి వస్తే లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలలో మొలక శాతం పరీక్షించి తెలుసుకోవాలి. మొలక శాతం తక్కువగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయ్యవద్దు.

– బలుసు రవి, ఏఓ, కె.గంగవరం

ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు

గ్రామ సచివాలయాల పరిధిలోని ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రాలు)ల్లో లభించే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులు కొనుగోలు చేసుకోవాలి. రైతులు అప్రమత్తంగా ఉండాలి. బయట షాపుల్లో దొరికే నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు.

– ఇళ్ల సూర్యనారాయణ, ఎంఏఏసీ కమిటీ చైర్మన్, కె.గంగవరం

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యలత

రామచంద్రపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలో వివిధ కోర్సులు, కళాశాల తరగతుల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకునేందుకు సీపీడీసీ కమిటీ సమావేశంలో చర్చించామని ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత తెలిపారు. కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన సోమవారం సీపీడీసీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబెక్టుల అమలు, స్కిల్ కోర్సులు, హిందీ సబ్జెక్టులను నిలబెట్టాలని, కళాశాల అభివృద్ధికి నూతన షెడ్ల నిర్మాణం, కంప్యూటర్ల కొనుగోలు నూతన తరగతులు నిర్మాణం కోసం సీఎస్ఆర్, ఓఎన్‌జీసీ నిధులు వినియోగం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. సీపీడీసీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎస్.దుర్గాప్రసాద్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు దూరమై వ్యక్తిగత విమర్శలా?

లీలాకృష్ణ తీరుపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ నేతలు



అంగరలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అబ్బు, నాయకులు

కపిలేశ్వరపురం: జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ నియోజకవర్గ ప్రజలకు దూరమై హైదరాబాద్‌లో ఉంటున్నారని, అప్పుడప్పుడూ వచ్చి తమ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై విమర్శలు చేస్తూ మానసిక ఆనందం పొందుతున్నారని వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు విమర్శించారు. అంగరలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, నాయకులు నక్కా సింహాచలం, మేడిశెట్టి దుర్గారావు, ఏలేటి గంగరాజు మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై జనసేన నేత లీలాకృష్ణ వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలోని గడప గడపకూ పర్యటిస్తున్న తమ నేత తోటను నాన్ లోకల్ అనే అర్హత హైదరాబాద్‌లో ఉంటున్న లీలాకృష్ణకు లేదన్నారు. లీలాకృష్ణ తన రాజకీయ జీవితంలో విమర్శలు, గొడవలకు పాల్పడడం తప్ప పేదలెవరికైనా ఇల్లు కట్టించడం కానీ, ఇతర లబ్ధి చేకూర్చడం కానీ చేయలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్న ఘనత ఎంతటిదో తోట వల్ల లబ్దిపొందిన జనసేన నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకోమని స్పష్టం చేశారు. ఇసుకను అక్రమంగా దోచుకుంటున్నారంటూ గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వేగుళ్ళపై లీలాకృష్ణ విమర్శలు చేశారని, ఇప్పుడు అదే ఎమ్మెల్యే వేగుళ్ళతో లీలాకృష్ణ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుండటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ తోట తరచూ పార్టీలు మారుతున్నారని అనే ముందు లీలాకృష్ణ తాను మారిన పార్టీల సంఖ్యను లెక్కించుకోవాలన్నారు. రాజకీయ విమర్శలను తాము ఎప్పుడూ స్వీకరిస్తామని, కానీ నిత్యం ప్రజల్లో ఉంటున్న ఎమ్మెల్సీ తోటపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించమని చెప్పారు. సమావేశంలో యర్రా వీరన్నబాబు, పసలపూడి శ్రీనివాసరావు, అరదాని శ్రీదేవి, షేక్ వల్లీ, పాలింగి కృష్ణకిశోర్, కట్టా మురళి మాట్లాడారు.

రామారెడ్డి హత్య దారుణం



మండపేటలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కోస్తాంధ్ర రెడ్డి సంఘం నాయకులు త్రినాథరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం నేతల డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో మండపేటలో భారీ ర్యాలీ

మండపేట: పట్టణానికి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, గౌరవాధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. రామారెడ్డి హత్యను ఖండిస్తూ కోస్తాంధ్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 72 సంఘాల నుంచి అధిక సంఖ్యలో రెడ్డి సామాజిక వర్గీయులు నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు రోడ్డులోని సహస్ర రెస్టారెంట్ వద్ద నుంచి కేపీ రోడ్డు, బస్టాండు, రాజారత్న రోడ్డు మీదుగా రామారెడ్డి నివాసం వరకు ర్యాలీ చేశారు. అనంతరం రామారెడ్డి సతీమణి శ్వేతనాగదేవి, కుటుంబ సభ్యులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి తదితరులను పరామర్శించారు. రామారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘటన వివరాల గురించి శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, నిందితులకు కఠిన శిక్ష పడేలా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని భరోసాఇచ్చారు. అనంతరం త్రినాథరెడ్డి, సుబ్బారెడ్డి, సంఘ జిల్లా మహిళ అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతమ్మ తదితరులు మాట్లాడుతూ వివాద రహితునిగా రామారెడ్డికి సహచర వ్యాపార వర్గాల్లో మంచి పేరుందన్నారు. రూ. 80,000 బాకీ సొమ్ము చెల్లించమని కోరినందుకు అప్పుతీసుకున్న ఇరువురు వ్యక్తులు ఆయన్ను పథకం ప్రకారం నిలువునా గోతిలో పూడ్చిపెట్టి అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. గతంలో ఎక్కడ ఇటువంటి దారుణ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం సంఘం నాయకులు ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిందితులకు త్వరితగతిన శిక్షపడేలా కృషి చేయాలని పోలీసులకు వినతిపత్రం అందజేశారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కర్రి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి, సత్తి వీర్రెడ్డి, గుడిమెట్ల కల్కి రెడ్డి, కర్రి వీర్రెడ్డి, మల్లిడి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మండపేట చైర్‌పర్సన్ దుర్గారాణికి మొక్క అందజేస్తున్న ఎస్ఐఓ సభ్యులు



మొక్క నాటుతున్న రామచంద్రపురం చైర్‌పర్సన్ శ్రీదేవి

చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా కాలుష్య నియంత్రణకు పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణానికి చెందిన స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ సభ్యులు పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రముఖులను కలిసి మొక్కలు అందజేశారు. సంస్థ సభ్యులు వసీం, సమీర్, గఫూర్, సుల్తాన్, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, మొండి భవాని, పార్టీ నాయకులు పేరూరి మాధవి, శెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామచంద్రపురం: భవిష్యత్ తరాల వారికి మంచి పర్యావరణాన్ని అందించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని 20వ వార్డులో సోమవారం జరిగిన కార్యక్రమంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ శ్రీదేవి ప్రారంభించారు. కౌన్సిలర్ కె.సూర్యకుమారి, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు సురేష్, ట్రస్టు సభ్యులు విజయ్, శ్రీరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. అధ్యాపకులు ఉషశ్రీ, పి.మధులత, రాజేంద్రప్రసాద్, ఎన్ని రమణ, కె.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: పర్యావరణంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన అవసరమని డీఈఓ కమలకుమారి అన్నారు. కె.గంగవరం ఎమ్మార్సీ భవనంలో సోమవారం నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతిభా పోటీల్లో విజేతలకు ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పామర్రు ఉన్నత పాఠశాలలోని జగనన్న విద్యాకానుక కిట్లు స్టాక్ రూంను పరిశీలించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మనందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న కొప్పిశెట్టి కృష్ణ

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం వద్ద బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. సోమవారం సాయంత్రం మండలంలోని జగన్నాథగిరికి చెందిన కొప్పిశెట్టి కృష్ణ గొల్లపాలెం కాజులూరు జంక్షన్‌లో రోడ్డు పక్కగా నడచి వెళుతున్నాడు. కరప మండలం కొంగోడుకు చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై దాక్షరామ వైపు వేగంగా వెళుతూ నడచి వెళుతున్న కృష్ణను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ సంఘటనలో కృష్ణ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకోగా బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్సులో ఇరువురినీ కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలో బైక్ విడిచిపెట్టి పరారయ్యారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్ సౌజన్య దంపతులకు సత్కారం



సర్పంచ్ సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధి కూలీలు, పంచాయతీ సిబ్బంది

మండపేట: నియోజకవర్గంలోనే అతిచిన్న పంచాయతీ అయిన మెర్నిపాడు గ్రామాభివృద్ధికి సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కుమార్ దంపతులు చేస్తున్న కృషికి గాను సోమవారం ఉపాధి కూలీలు వారిని ఘనంగా సత్కరించారు. గత ప్రభుత్వాల్లో ఎప్పుడూ జరగని విధంగా గత రెండేళ్లలో దాదాపు రూ. కోటి నిధులు తీసుకురావడం ద్వారా గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రధానంగా నాలుగు దశాబ్దాలుగా గ్రామాన్ని పట్టి పీడిస్తున్న పుంత రోడ్డును రూ. 21.5 లక్షలతో బైపాస్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దశాబ్దంన్నరగా అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీలో రూ. 20 లక్షలతో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వసతి కల్పించారు. రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్థిక సంఘం నిధులు రూ. 1.6 లక్షలతో ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి సచివాలయం వరకు గ్రావెల్‌రోడ్డు, రూ. 1.4 లక్షలతో చెరువుకు రక్షణ గోడ, రూ. లక్షతో కాలనీలో వాటర్‌పైప్‌లైన్లు నిర్మించారు. నాడు నేడు పథకం కింద రూ. 25 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టారు. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాభివృద్ధికి సర్పంచ్ సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు అందిస్తున్న సేవలకు గాను పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉపాది కూలీలు వారిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అతి చిన్న గ్రామమైన పెద్ద గ్రామాలతో పోటీగా తమకు పనులు కల్పిస్తున్నారని, గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వర్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రికెళ్లి పింఛను అందజేత



కాకినాడలో సింహాచలానికి పింఛను ఇస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి



కాకినాడలో సుబ్బారావుకు పింఛను ఇస్తున్న వలంటీర్లు శ్రీదేవి, సుధారాణి

కపిలేశ్వరపురం: సకాలంలో పేదలకు సాయం అందితీరాల్సిందే అన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు క్రమం తప్పకుండా నెరవేరుస్తున్నారు. తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛను డబ్బులను చేతికిస్తున్నారు. లబ్ధిదారు ఆరోగ్యం బాలేక ఆసుపత్రి పాలైతే ఆసుపత్రికెళ్లి పింఛను డబ్బులిస్తూ వలంటీర్లు మానవత్వం చాటుకుంటున్నారు. వల్లూరు సచివాలయం పరిధికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు అనారోగ్య కారణాలతో కాకినాడలో ఉంటున్నారు. గ్రామ వలంటీర్లు కాకినాడ వెళ్లి పింఛను అందజేసి అందరి ప్రశంసలను అందుకున్నారు. వెన్నెముకకు ఆపరేషన్ చేయించుకుని కాకినాడలోని కుమార్తె ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న సప్పా సింహాచలానికి వలంటీర్ కోట వెంకటలక్ష్మి పింఛను అందించారు. అనారోగ్య కారణంగా కాకినాడలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్న వల్లూరి సుబ్బారావుకు వలంటీర్లు వాసంశెట్టి శ్రీదేవి, కోట సుధారాణిలు పింఛను సొమ్ము అందజేశారు.

కౌలు రైతులకు అండగా నిలవండి

మంత్రి వేణు




సహకార సంఘాల చైర్మన్లకు సూచనలు చేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్‌లు నియోజకవర్గంలోని కౌలు రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. నియోజకవర్గంలోని 30 సంఘాల చైర్మన్లతో రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. రైతే రాజు అనే నానుడిని నిజం చేయాలన్న సంకల్పంతో సీఎం పనిచేస్తున్నారని తెలిపారు. సహకార సంఘాల ద్వారా ఇచ్చే రుణాలు నిమిత్తం క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లించి వారిని ఆదుకుంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను అదే సీజన్‌లో నష్ట పరిహారం అందించి ఆదుకోవడం దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే సీఎం జగన్ వల్ల సాధ్యమైందన్నారు. సహకార సంఘాల చైర్మన్లు కౌలు రైతులకు విరివిగా గ్రూప్‌లు ఏర్పాటు చేసి వారికి సహకారం అందించాలని మంత్రి వేణు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా 'జన భాగిదారి'

రాయవరం: మండలంలోని పలు పాఠశాలల్లో జన భాగిదారి కార్యక్రమాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. డీఈఓ ఎం.కమలకుమారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో కథలు చెప్పించడం, పాటలు పాడించడం, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి జన్‌భాగిదారిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో వై.సత్యనారాయణ మాట్లాడుతూ జన్‌భాగిదారిని పండుగ వాతావరణంలో నిర్వహించామన్నారు. అలాగే పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు.

వెదురుపాకలో సత్తెమ్మ తల్లి సంబరం



సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: వెదురుపాకలో గ్రామదేవత సత్తెమ్మతల్లి సంబరాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుడైన మాచవరపు సురేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బుట్టబొమ్మలు, గారడీలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి (పెద్దబ్బాయ్), సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తాడి బులివెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సత్తి పద్దారెడ్డి, కర్రి వీర్రాఘవరెడ్డి (చిన్నీలు), వాసంశెట్టి గోపీకృష్ణ, నీలంశెట్టి వెంకన్న తదితరులు సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు చేసి, అన్నదానంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం: స్థానిక సీడీపీఓ కార్యాలయం పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడదలైనట్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానికులు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు ఈ ఏడాది జూలై 1 నాటికి 21–35 మధ్య ఉండాలన్నారు. దరఖాస్తు ఫారాలు తమ కార్యాలయంలో ఉన్నాయని, నింపిన దరఖాస్తులను ఈనెల 16 సాయంత్రం ఐదు గంటల లోగా తన కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు–1 కేంద్రం సహాయకురాలి పోస్టును బీసీ ఇ, పడమర ఖండ్రికను బీసీ ఎ, కపిలేశ్వరపురం పోస్టును ఎస్టీ సామాజిక వర్గీయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కె.గంగవరం మండలం నరజాడ పోస్టును బీసీ ఎ, కె.గంగవరం 03 బీసీ డి, రావిదొడ్డిపేట ఎస్సీ, తామరపల్లి, శేరిలంక పోస్టులను ఓసీ సామాజిక వర్గీయులకు కేటాయించినట్టు సీడీపీఓ గజలక్ష్మి తెలిపారు.